కేక్ కట్ చేస్తున్న మంత్రి సీతక్క

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క**

ములుగురూరల్/గోవిందరావుపేట, మార్చి 9 : మహిళల హక్కుల సాధన కోసమే ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని అన్నారు. మహిళా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు మంత్రి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్‌లో మంత్రి కాసిందేవిపేట, జంగాలపల్లి, రామచంద్రాపురం గ్రామాల భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్మించిన పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌ను ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. గోవిందరావుపేట మండలం రాఘవపట్నం గ్రామంలో రూ.5లక్షలతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో వెంకటేశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, డీడబ్ల్యూవో శిరీష, జిల్లా స్థాయి అధికారులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**జాతరకు నిధులు కేటాయించాలని వినతి**

ములుగురూరల్ : కొత్తూరు గుట్టపై జరిగే లక్ష్మీనర్సింహస్వామి జాతరకు నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం కలెక్టరేట్ ఆవరణలో మంత్రి సీతక్కకు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు, సభ్యులు, గ్రామపెద్దలు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతరకు హాజరు కావాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి సంబంధితశాఖ అధికారులను జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

## న్యూజిలాండ్‌పై భారత్ విజయం సాధించాలని పూజలు

గణపురం, మార్చి 9 : మండలంలోని లక్ష్మిరెడ్డిపల్లి శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయస్వామి దేవాలయంలో గ్రామస్తులు, యువకులు ఆదివారం త్రివర్ణ పతాక రూపంలో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత క్రికెట్ జట్టు విజయం సాధించాలని వారు ప్రత్యేక పూజలు జరిపారు. న్యూజిలాండ్‌తో జరిగే పోరులో భారత క్రికెట్ జట్టు భారీ విజయం సాధించి భారత దేశ కీర్తి కిరీటంలో మరొక మైలు రాయిని చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బలబత్తుల రాజ్‌కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ ఒద్దుల విజయాశోక్‌రెడ్డి, మామిడాల విజయ్, వీరగోని నాగరాజ్, పున్నం భాస్కర్‌రెడ్డి, సాదు చంద్రయ్య, వీర మల్ల శ్రీశాంత్‌రెడ్డి, ఎడ్ల సంతోష్, విద్వత్, మేడిపల్లి సాత్విక్, శ్రావ్య, పెండ్యాల వినయ్, రిషి వర్ధన్, బొక్క గంగాధర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి భూసేకరణపై గ్రామసభలు

కాటారం, మార్చి 9 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వివిధ పనుల కోసం చేపట్టే భూ సేకరణ కోసం సోమ, మంగళ, బుధవారాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూ సేకరణ విభాగం) ఆధ్వర్యంలో జరిగే గ్రామసభలకు భూములు కోల్పోతున్న రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలుపాలన్నారు. 10వ తేదీన ఉదయం 10:30 గంటలకు కాటారం రైతువేదికలో గారెపల్లి పైప్‌లైన్‌కు సంబంధించిన 4ఎకరాల 38.50 గుంటల భూ సేకరణ గ్రామసభ, 11న జాదరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జాదరావుపేట చెరువు కట్ట విస్తరణకు సంబంధించిన 5 ఎకరాల 16గుంటల కోసం గ్రామసభ, 12న చిదినెపల్లి జీపీలో గారెపల్లి నూతన రిజర్వాయర్ సిస్టర్న్ నిర్మాణం కోసం చిదినెపల్లి, ప్రతాపగిరి, చింతకాని పరిధిలో 32ఎకరాల 38గుంటల భూసేకరణ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు వెల్లడించారు.

# ఇసుక లారీలతో ఇబ్బందులు

- ఎల్‌టీ రోడ్డుపై కిలో మీటర్ల మేర నిలుస్తున్న లారీలు
- రోజుల తరబడి అక్కడే నిరీక్షణ
- మద్యం తాగి బాటిళ్లను పంట పొలాల్లోనే పడేస్తున్న డ్రైవర్లు
- రోడ్డు వెంట వచ్చేందుకు జంకుతున్న కూలీలు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతులు

లారీ మధ్యన భయం గుప్పిట్లో కాలినడన పనులకు వెళ్తున్న కూలీలు(ఫైల్)

మహదేవపూర్ ఎల్‌టీ రోడ్డుపై నిలిచిఉన్న లారీలు

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 9 : గోదావరి పరివాహక గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలతో మండలంలో ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా గ్రామాల్లో క్వారీలకు ఇసుక కోసం భారీగా వచ్చే లారీలతో ప్రధాన రహదారులు గందరగోళంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని ఎల్‌టీ రోడ్డుపై వందలాదిగా ఇసుక లారీలు లోడింగ్ కోసం రోజుల తరబడి నిలపడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లారీతో రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. కూలీల కొరత కారణంగా దూరప్రాంతాల నుంచి వచ్చే కూలీలు లారీల రద్దీ కారణంగా కుదురుపల్లి క్రాస్ నుంచి కాలినడక భయంభయంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నడుచుకుంటూ వ్యవసాయ క్షేత్రాలకు పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కూలీలు సైతం మిర్చి కోత పనులకు వచ్చేందుకు నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఒక వైపు మిర్చి దిగుబడి రాక ఇబ్బంది పడుతున్న తమకు లారీల కారణంగా కూలీలు పనికి రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రోజుల తరబడి లారీలు వ్యవసాయ క్షేత్రాల్లోని ఎల్‌టీ రోడ్డుపై వేచి ఉండడంతో వందల మంది లారీ డ్రైవర్లు మల మూత్ర విసర్జనతోపాటు మద్యం సేవించి పంట పొలాల్లోనే పడేస్తున్నారని, దీంతో తమ పంటలకు నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ఒక వైపు దుర్గంధం, మరో వైపు లారీల మోతతో ప్రతి రోజూ నరకం అనుభవించాల్సి వస్తుందని రైతులు విలపిస్తున్నారు. గతంలో కేసీఆర్ పాలనలో ఇసుల క్వారీలు నడిచేదని, కానీ ఇంత దారణమైన పరిస్థితిని తామెన్నడూ చూడలేదని, నిత్యం పోలీసులు, అధికారుల పర్యవేక్షణలో

### కేసీఆర్ హయాంలోనే మంచిగ ఉండే..

నా పేరు సుంకే వెంకటేశ్. నాకు గ్రామంలో ఐదెకరాల భూమి ఉంది. దానిలో మిర్చి సాగు చేస్తున్న. నాటి కేసీఆర్ పాలనలోనే రైతులకు మంచిగ ఉండే. గతంలో ఇసుక క్వారీలు నడిచినయ్. సాఫీగా రవాణా నడిచేది. ఇప్పుడు అంత మారిపోయింది. పచ్చని పొలాల్లో రోజూ వందల లారీల వారాల తరబడి రోడ్డుపై ఉండడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రతి రోజూ ఏదో ఒక చోట లారీల కారణంగా రైతులు, కూలీలు ప్రమాదాలకు గురవుతున్నరు.దుమ్ము, ధూళిలో పంటలు చెడిపోతున్నయ్. లక్షలు అప్పు చేసి సాగు చేస్తే ఇసుక లారీల కారణంగా అంతా తలకిందులైంది. ఏం చేయాలో అర్థమైతలేదు. ప్రభుత్వం దృష్టి సారించి రైతుల ఇబ్బందులను పరిష్కరించాలి.

**- సుంకే వెంకటేశ్, రైతు, మహదేవపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా**

తమకు ఇబ్బందులు తలెత్తలేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇసుక లారీల కట్టడి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జిలు, డీఎస్పీ

## కోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలన

కాటారం, మార్చి 9 : కాటారం డివిజన్ కేంద్రంలో మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి/ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు కోసం ఆదివారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను జిల్లా జడ్జి నారాయణబాబు, జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు, అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అఖిల పరిశీలించారు. భూపాలపల్లి, మంథని బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి జడ్జి వైటీసీ(యూత్ ట్రైనింగ్ సెంటర్), తహసీల్దార్ కార్యాలయం, పలు ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్‌కుమార్, హరిబాబు, ప్రధాన కార్యదర్శులు సహేందర్‌రెడ్డి, మహేందర్, ఏవో అనిత, ఎస్సై అభినవ్, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు

## న్యాయ కళాశాల ఏర్పాటుకు ఉద్యమించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 9 : ఏజెన్సీలో న్యాయ కళాశాల ఏర్పాటుకు ఉద్యమించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కళాశాల ఏర్పాటుపై సదస్సు నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమ తెగలను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో అత్యధికంగా అన్యాయానికి గురయ్యేది ఆదిమ తెగలేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పలు ఆదివాసీ సంఘాల నాయకులు నత్యనారాయణ, కొర్స నర్సింహామూర్తి, ఉయిక శంకర్, మైపతి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

దేవాదుల ఎత్తిపోతల వద్ద నిండు కుండలా ఉన్న గోదావరి

కన్నాయిగూడెం, మార్చి 9 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో ఆరు మోటర్ల ద్వారా ఆదివారం గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతున్నది. ఫేస్-2లోని రెండు, ఫేస్-3లోని నాలుగు మోటర్లతో రోజుకు 1661 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 26 న ఫేస్-2 లోని ఒక మోటర్ ఆన్ చేయగా ఇప్పుడు మరో మోటర్ ఆన్ చేశారు. తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క బరాజ్ అందుబాటులోకి రావడంతో దేవాదుల ఎత్తిపోతల వద్ద గోదావరి నది నిండు కుండలా కన్పిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. దీంతో మండు వేసవిలో కూడా అన్ని (10) మోటర్లకు సరిపడా నీటిమట్టం ఉంది. ఇప్పటివరకు 24-25 సంవత్సరానికిగాను మోటర్ల ద్వారా భీంఘనపురం రిజర్వాయర్‌లోకి 13.220 టీఎంసీల నీటిని తరలించినట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

## మార్చి 23 వరకు 'యువికా' దరఖాస్తులకు గడువు

- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి

భూపాలపల్లి రూరల్, మార్చి 9 : అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం( యువికా) నిర్వహిస్తోందని, జిల్లాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుందని, అగ్రదేశాలకు దీటుగా భారత్ పరిశోధనలు చేపడుతోందని, ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమం చేపడుతున్నదని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మార్చి 23వ తేదీ లోగా www.isro.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారని, మే 18 నుంచి విద్యార్థులను ఆహ్వానించి మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారని, మే 31న ముగింపు సందర్భంగా కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## టీపీఎఫ్ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీపీఎఫ్ నేతలు

కాటారం, మార్చి 9 : తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని టీపీఎఫ్ జిల్లా కో-కన్వీనర్ దుబాసి పార్వతి పిలుపునిచ్చారు. ఆదివారం కాటారం మండలకేంద్రంలో టీపీఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీపీఎఫ్ నేతలు పార్వతి, కుడిమేత సరస్వతి మాట్లాడుతూ మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి పోసింది తెలంగాణ ప్రజా ఫ్రంటేనన్నారు. దోపిడీ, పీడన లేని ప్రజాస్వామిక తెలంగాణ కోసం మహనీయుల ఆశయసాధనకు టీపీఎఫ్ ప్రజల పక్షాన పోరాడుతున్నదని ఉద్ఘాటించారు. మహాసభలకు ప్రజాస్వామికవాదులు, మేధావులు, కార్మికులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్ నాయకులు లావణ్య, లక్ష్మి, మల్లిక, సునిత, రజిత, పుష్ప, పద్మ ఉన్నారు.

## వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఏటూరునాగారం, మార్చి 9 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. 1968 నుంచి 2025 వరకు ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై చేర్చాలనే తపనతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం నిర్వహణపై పూర్వ విద్యార్థులు సమగ్రంగా చర్చించారు. మే 3, 4తేదీల్లో రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. పూర్వ విద్యార్థులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు సూచించారు. ఈ మేరకు కన్వీనర్, కో కన్వీనర్లను ప్రస్తుతం నియమించారు. పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను సమావేశానికి హాజరయ్యే విధంగా చూడాలని, దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులంతా ఈ వేడుకకు కదిలి రావాలని కోరారు. సమావేశంలో నిర్వహణ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామప్పలో విదేశీయులు

రామప్ప ఆలయం వద్ద విద్యార్థుల సందడి

వెంకటాపూర్, మార్చి 9 : మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఇంగ్లాండ్, కొలంబియా దేశస్తులు సందర్శించారు. ఆదివారం సెలవు కావడంతో విద్యార్థులు, పర్యాటకులతో కోలాహలంగా మారింది. ఆలయ చరిత్రను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

## ఏఎన్ఎం కుటుంబానికి అండగా వైద్య సిబ్బంది

ఏఎన్ఎం సురేఖ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైద్యాధికారి మధు

గోవిందరావుపేట, మార్చి 9 : పస్రా పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంగా పనిచేసిన సురేఖ ఇటీవల మృతి చెందడం చాలా బాధాకరమని పస్రా వైద్యాధికారి మధు అన్నారు. ఆదివారం మృతురాలి కుటుంబాన్ని వైద్యాధికారి మధు ఆధ్వర్యంలో పరామర్శించారు. గత 23యేళ్లుగా ఏఎన్ఎంగా ప్రజలకు సురేఖ విశిష్ట సేవలు అందించారని, ఆమె మృతి తీరని లోటని అన్నారు. పస్రా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రూ.40వేలు, వైద్య ఆరోగ్య శాఖలోని ఐఎన్‌టీయూసీ 3194 యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఫయాజ్‌మోహినోద్దీన్, ములుగు జిల్లా అధ్యక్షుడు వంగేటి వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో రూ.95వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి వినోధర్, కార్యదర్శి శ్రీనివాస్, రిటైర్డ్ డీపీఎంవో సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్ ఈవో మొగిలి, ఎస్ఈవో భూపాల్‌రెడ్డి, సురేశ్‌బాబు, కుమారస్వామితోపాటు స్థానిక ఆరోగ్య కార్యకర్తలు సరోజన, సుజాత, వెంకన్నటమ్మ, జంపయ్య, శ్రీనివాస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



స్వామి వారికి సూర్యవాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

## కొడవటంచలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రేగొండ, మార్చి 9 : మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను జాతర చైర్మన్ మల్కనూరి భిక్షపతి, ఈవో మహేశ్ ప్రారంభించారు. మొదటి రోజు స్వామి వారికి సూర్య వాహన సేవ నిర్వహించి మూడ వీధుల గుండా ఊరేగించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రేగొండ/గణపురం, మార్చి 9 : రేగొండ, గణపురం మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. రేగొండలోని రైతువేదికలో చెక్కుల పంపిణీ అనంతరం దమ్మన్నపేట నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అలాగే, భాగిర్ధిపేట క్రాస్ రోడ్డు నుంచి బుదరం, రేగొండ నుంచి కొడవటంచ, రేపాక నుంచి జోగయ్యపల్లె, తిరుమలగిరి నుంచి బుగులోని జాతర, లింగాల నుంచి దుంపిల్లపల్లె, పోచంపల్లి నుంచి భాగిర్ధిపేటకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. అలాగే, రేగొండ, తిరుమలగిరి, దమ్మన్నపేట, కనిపర్తి, నాగర్లపల్లె, రేపాక, పోచంపల్లి, లింగాల, మడుత్తపల్లి, భాగిర్ధిపేట, గూడెపల్లె, సుల్తాన్‌పూర్, గోరికొత్తపల్లి గ్రామాల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు, సైడు కాల్వల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కాగా, గణపురం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 64మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెల్పూర్ పీఏసీఎస్ ఆవరణలో చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయంలో మీసేవ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధురకవి సత్యనారాయణస్వామి, సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణికి సకాలంలో హాజరు కావాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 9 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 10న (సోమవారం) ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు గైర్హాజరు కాకుండా, సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ కుమార్

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

వెంకటాపురం(నూగూరు), మార్చి 9 : వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం ఏఎస్సై అక్బర్ బాష సహకారంతో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా సీఐ ఎస్సై కొప్పుల తిరుపతిరావుతో కలిసి ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్, పంజా శివకుమార్, ఏఎస్సై అక్బర్‌బాషా, వ్యాపారులు బాలసాని అశ్వపతి, అన్వర్, సలీమ్, కిశోర్ పాల్గొన్నారు.

మహిళా పాస్టర్లను సన్మానిస్తున్న నిర్వాహకులు

## ఘనంగా మహిళా దినోత్సవం

కాటారం, మార్చి 9 : మండలంలోని దేవరాంపల్లి, అల్లిపూర్ గ్రామాల్లోని బెతెస్డా ప్రార్థన మందిరాల్లో ఆదివారం మిత్వాగ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన చర్చి మహిళా పాస్టర్లు సాలోమిజయరాజ్, సులోచన, మణెమ్మ, పద్మిని తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో మిత్వాగ్రేస్ మినిస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి శిరీషా రాణి, సభ్యులు లలిత, అభిగేయల్, సులోచన పాల్గొన్నారు.

అభివాదం తెలుపుతున్న సామాజిక న్యాయ వేదిక నాయకులు

## బహుజనులు రాజకీయ పోరాటం చేయాలి

ములుగురూరల్, మార్చి 9 : ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యతద్వారానే బహుజన రాజకీయ పోరాటం చేయాలని సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు పోరిక శ్యామల్‌నాయక్ అన్నారు. ఆదివారం జరిగిన కులసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజనులు ఒక్కటిగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఐక్యత చాలా ముఖ్యమని తెలిపారు. సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆశాడపు దేవేందర్, కుల సంఘాల నాయకులు రఘు, కందకట్ల సారయ్య, రాణా ప్రతాప్, నర్సయ్య, మల్లిఖార్జున్, గట్టయ్య, సమ్మయ్య, బుచ్చన్న, యాసిన్, బాలాజీనాయక్, రాజేందర్, వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

## బ్రిడ్జి పై నుంచి కిందపడిన ట్రాలీ ఆటో .. తప్పిన ప్రమాదం

వాజేడు, మార్చి 9 : మండలంలోని మొరుమూరు గ్రామపంచాయతీలోని అరుణాచలపురం గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున వెంకటాపురం వైపు నుంచి ఏటూరునాగారం వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు బ్రిడ్జి పై నుంచి కిందపడిపోయింది. ఆ సమయంలో ట్రాలీ ఆటోలో ఎవరూ లేకపోవడంతో డ్రైవర్‌కు సైతం ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయ్యింది. గ్రామస్తులతో కలిసి ట్రాక్టర్ సహాయంతో బ్రిడ్జిపై నుంచి కిందపడిన ట్రాలీ ఆటోని బయటకు తీశారు.

బ్రిడ్జిపై నుంచి కింద పడిన ట్రాలీ ఆటో

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వాజేడు, మార్చి 9 : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో(హైస్కూల్లో) 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు కృష్ణారావు, నర్సింహారావు, వెంకట్రావు, సోమయచారి, పురుషోత్తం, రా మ్మూర్తి, కిష్టయ్య, వేణు, కిశోర్, రమణచారి, సత్యనారాయణ, పియర్స్, చక్రధర్, పూర్వ విద్యార్థులు పాలిశెట్టి గోవింద్, రఘుపతి, రవి, విజయ్, విశాలక్షి, చంద్రకాంత, మంగ, సుహాసిని, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్‌లో 25శాతం రాయితీ

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 9 : ఎల్ఆర్ఎస్ 2020లో దరఖాస్తు చేసుకున్న (ఇంటి స్థలం కలిగిన) దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు చెల్లించే రుసుముపై 25శాతం రాయితీ కల్పించబడిందని ఎంపీవో ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో 21దరఖాస్తులు, మండల పరిధిలోని అంబట్‌పల్లి 1, కాళేశ్వరం146, మెట్‌పల్లి7, మజీద్‌పల్లి 3 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి ప్లాట్ క్రమబద్ధీకరణ చేసుకోవాలని, గడువు దాటితే రాయితీ వర్తించదన్నారు.

## ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ

### జిల్లా